సాక్షి ములుగు

బుధవారం । 16 । జూలై । 2025



పంచుకున్నదెవరు?

కొత్త పోస్టులతో ప్రయోజనం చేకూరుతుందని ఆశ చూపి కొందరు వసూళ్లకు పాల్పడినట్లు విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. - 10లో▸



తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లపై సమీక్ష

ఈనెల 19 నుంచి కేయూలో నిర్వహించనున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లపై కేయూ వీసీ సమీక్ష నిర్వహించారు. - 10లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $33^0/24^0$

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రత ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రుణాలు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలి

● కలెక్టర్ టీఎస్.దివాకర



ములుగు రూరల్: మహిళా సంఘాల నుంచి రుణాలు పొందిన సభ్యులు సక్రమంగా రుణాలు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కలెక్టర్ టీఎస్ దివాకర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 4,409 సంఘాలకు రూ.3.26కోట్ల వడ్డీ రాయితీ పొందారని పేర్కొన్నారు. 2024 నుంచి 2025 వరకు 5,233 సంఘాల సభ్యులు రూ.8.97కోట్ల రాయితీ పొందినట్లు వివరించారు. ఫిబ్రవరి 2025 మార్చి నెలలో 5,308 సంఘాలకు ప్రభుత్వం రూ.1.91 కోట్ల రాయితీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ. 10.88కోట్ల వడ్డీ రాయితీ వచ్చినట్లు వివరించారు.

వైద్యులు ఉత్తమ సేవలు అందించాలి



ములుగురూరల్: ములుగు ఏరియా వైద్యశాలలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండి రోగులకు ఉత్తమ వైద్య సేవలను అందించాలని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ములుగు ఏరియా వైద్యశాల బాధ్యతలను నూతనంగా చేపట్టిన చంద్రశేఖర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రజలకు వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, తిరుపతి, జయకర్, జక్కుల రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు



ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల పరిధిలోని తోగుగూడెంలో మావోయిస్టు ఆత్మపరిరక్షణ ప్రజాఫ్రంట్ తెలంగాణ పేరుతో మావోయిస్టులకు వ్యతిరేకంగా మంగళవారం వాల్‌పోస్టర్లు వెలిశాయి. అడవిని, ఆయుధాలు వీడి జన జీవన స్రవంతిలోకి రండి.. మీ మేధస్సును ప్రజల అభివృద్ధికి ఉపయోగించాలని వాల్‌పోస్టర్లలో పేర్కొన్నారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు వెలువడంతో చర్చనీయాంశంగా మారింది.

చెల్పాకకు బస్సు సౌకర్యం కల్పించాలి

ఏటూరునాగారం: మండల పరిధిలోని చెల్పాక గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) జిల్లా ఉపాధ్యక్షుడు కర్నె లాజర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. మండల కేంద్రం నుంచి బస్సు చెల్పాక వరకు రవాణా సౌకర్యం కల్పిస్తే విద్యార్థులు, రైతులకు ఉపయోగంగా ఉంటుందని కోరారు.

కస్తూర్బాగాంధీ పాఠశాల తనిఖీ



ములుగు రూరల్: మండల పరిధిలోని మదనపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలను మంగళవారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారం లేకుండా చూడాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, జయకర్, జక్కుల రేవంత్, రమణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యంత్రాంగం సిద్ధం

స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఎన్నికల నిర్వహణకు ఆరు నెలల నుంచే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకొని ఎన్నికల సిబ్బందికి సైతం శిక్షణ ఇచ్చారు. ఓటర్ల జాబితా, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, ఎన్నికల గుర్తులు కేటాయింపు, బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమై ఉంది.



స్థానిక రిజర్వేషన్లపై ఉత్కంఠ..

మండలం యూనిట్‌గా రిజర్వేషన్లు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలుకు ప్రభుత్వం సన్నాహాలు
- బీసీలకు 42శాతం కేటాయింపుతో మారనున్న సమీకరణాలు
- జిల్లాలో 9 ఎంపీపీ, జెడ్పీటీసీ, 83 ఎంపీటీసీ స్థానాలు



రిజర్వేషన్ కేటాయింపు ఇలా..

వెంకటాపురం(ఎం): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే పేర్కొంది. ఇన్నాళ్లుగా రిజర్వేషన్ల ప్రక్రియ ఎన్నికల నిర్వహణకు అడ్డంకిగా మారింది. ప్రస్తుతం అది కూడా తొలగిపోనుండడంతో ఎన్నికలు నిర్వహణకు మార్గం సుగుమమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు పెద్దపీట వేస్తుంది. ఈ ఎన్నికల్లోనే. 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తీసుకురాబోతుంది. ఈ నెలాఖరు వరకు రిజర్వేషన్లు ఖరారు కానున్నట్టు తెలుస్తోంది. దీంతో బీసీ వర్గాలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి మండలాన్ని యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లు కేటాయించనున్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలకు జిల్లాను యూనిట్‌గా చేసుకుని రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. జెడ్పీ చైర్మన్ మాత్రం రాష్ట్రాన్ని యూనిట్‌గా చేసుకుని రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. గత ఎన్నికల్లో పంచాయతీలకు కూడా రాష్ట్రాన్ని యూనిట్‌గా చేసుకుని రిజర్వేషన్లు ఖరారు చేశారు. మండలాన్ని యూనిట్‌గా చేసుకుని సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు ఆయా ప్రాంతాల్లో ఉన్న ఆయా కులాల జనాభా ఆధారంగా మండల పరిషత్‌కు, తర్వాత సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంది.

పాత రిజర్వేషన్లు రద్దు..

గత ప్రభుత్వం వరుసగా రెండు పర్యాయాలకు రిజర్వేషన్లు ఖరారు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాత రిజర్వేషన్లను రద్దు చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలుకు చర్యలు తీసుకుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా గతంలో ఉన్న రిజర్వేషన్లన్నీ మారిపోనున్నాయి. ఆయా గ్రామాల్లో గత సంవత్సరం వచ్చిన రిజర్వేషన్లు ఈ సారి వచ్చే అవకాశం ఉండదు. జిల్లాలో బీసీలకు 42 శాతం, ఎస్టీలకు 7శాతం, ఎస్సీలకు 15 శాతంతో పాటు అన్ని కేటగిరీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం ఉండడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు, వివిధ పార్టీల నాయకులు రిజర్వేషన్ల కోసం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

171 జీపీలు.. 1,520 వార్డు స్థానాలు

జిల్లాలో 9 మండలాలు ఉండగా జిల్లా కేంద్రాన్ని మున్సిపాలిటీగా మార్చారు. దీంతో జిల్లాలో మరో నూతనంగా ఏర్పడిన మల్లంపల్లి మండలాన్ని కలుపుకొని తిరిగి 9 ఎంపీపీ, 9 జెడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేయనున్నట్లు సమాచారం. జిల్లాలో 83 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 35 స్థానాలు బీసీలకు కేటాయించనున్నారు. 9 మండలాల పరిధిలో 171 గ్రామ పంచాయతీలు ఉండగా 1,520 వార్డు స్థానాలు ఉన్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించడంతో పాటు మహిళలకు 50 శాతం స్థానాలు కేటాయించనున్నారు.

చట్టానికి లోబడి సమస్యలు పరిష్కరించాలి



వీసీలో పాల్గొన్న అధికారులు

ములుగు రూరల్: భూ భారతి చట్టానికి లోబడి సమస్యలు పరిష్కరించాలని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్ సూచించారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు సమస్యలను వేగంగా పరిష్కరించాలన్నారు. దరఖాస్తుల పరిశీలన మొత్తం ఆన్‌లైన్ ప్రాసెస్‌లో మాత్రమే చేపట్టాలన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశ్, తహసీల్దార్ విజయ్ భాస్కర్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

● ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటేశ్వర్లు



రామన్నగూడెంలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఏటూరునాగారం: ప్రజలు ఎయిడ్స్ వ్యాధిపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సామాజిక వైద్యశాల ఐసీటీసీ కౌన్సిలర్ గులగట్టు వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని రామన్నగూడెంలో మంగళవారం ఉచిత సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు దిశ వారి సౌజన్యంతో హెల్త్ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, టీబీ, హైపటైటిస్‌బీ, సిఫిలిస్, హెచ్ఐవీ పరీక్షలు 50 మందికి చేసినట్లు వివరించారు. ఎవరికైనా హెచ్ఐవీపై అనుమానం ఉంటే క్రాస్‌రోడ్డులోని సామాజిక ఆస్పత్రిలో ఐసీటీసీ సెంటర్‌లో ఉచితంగా పరీక్షలు చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐహెచ్‌సీ మొబైల్ వాహన కౌన్సిలర్ అనూష, ల్యాబ్ టెక్నీషియన్ సాగర్, ఏఎన్ఎం ధనలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జైలు బాబు, గ్రామ కార్యదర్శి జ్యోతి, ఆశ కార్యకర్తలు కాశింబీ, లావణ్య, ఔట్ రీచ్ వర్కర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ సొసైటీగా ములుగు పీఏసీఎస్



అవార్డు అందుకుంటున్న పీఏసీఎస్ చైర్మన్ సత్తిరెడ్డి

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బెస్ట్ సొసైటీగా ఎంపికైంది. సొసైటీ నిర్వహణ, రైతులకు అందించిన రుణాల వంటి సేవలను గుర్తించి నాబార్డు సంస్థ వారు అవార్డును అందించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు నుంచి పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీ ఎస్‌కు అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు.

రూ.3.16 లక్షల చెక్కు అందజేత

వాజేడు: వాజేడు పీఏసీఎస్‌కి రూ.3.16 లక్షల చెక్కును టెక్సాబ్ చైర్మన్ రవీందర్‌రావు అందజేశారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థకు పీఏసీఎస్ ఎంపిక కావడంతో హైదరాబాద్‌లోని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆఫీస్ ఖర్చులకు చెక్కు తనకు అందజేసినట్లు సొసైటీ అధ్యక్షుడు అంజయ్య తెలిపారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

వీసీలో ట్రైబల్ వెల్ఫేర్ ముఖ్యకార్యదర్శి శరత్



వీసీలో మాట్లాడుతున్న శరత్, అధికారులు

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి శరత్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఐటీడీఏ నుంచి వీసీలో పీఓ చిత్రామిశ్రా, డీటీడీఓ పోచంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎం జేఏఎన్ఎంఏఎన్), ధర్తీ ఆభా జంజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్(డీఏ జేయూఏ) పథకం ద్వారా 26 రాష్ట్రాల్లోని 5.5 కోట్ల గిరిజన జనాభాకు రూ.80 వేల కోట్లతో అసాధ్యమైన ప్రాంతాల్లో వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిధులతో గిరిజనులకు రోడ్లు, తాగునీటి సరఫరా, ఆరోగ్యం, టెలీకమ్యూనికేషన్, విద్యుత్, గృహ నిర్మాణం వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, గిరిజన గ్రామాల్లోని విద్యార్థులు, గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి గ్రామస్తులకు ప్రొఫైల్ తయారు చేయాలని సూచించారు. రక్తహీనత, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు అత్యవసర చికిత్సలు అందించాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం, వసతి కల్పించాలన్నారు. ఎక్కడైనా ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

● కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్



మాట్లాడుతున్న రత్నం ప్రవీణ్

గోవిందరావుపేట: ఈ నెల 22, 23, 24 తేదీలలో సూర్యాపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ అన్నారు. మండల పరిధిలోని పస్రాలో ప్రజాసంఘాల కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అంబాల మురళి అధ్యక్షతన మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమాజంలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన సామాజిక అంతరాలు, కుల వివక్షత, అంటరానితనం, మూఢనమ్మకాలను నిర్మూలించడం కోసం కేవీపీఎస్ పని చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో అనేక ఉద్యమాలు నిర్వహించి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సాధించుకున్నామని తెలిపారు. కుల వివక్ష, అంటరానితనంపై నిరంతరం పోరాడుతూ కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు సకాలంలో అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు వసతులు మెరుగు పర్చాలని కోరారు. దళిత బహుజనులందరికీ ఉచిత విద్యుత్ 200 యూనిట్ల నుంచి 300 యూనిట్ల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ భౌగోళిక అంశాలపైన అవగాహన కల్పించేందుకు కేవీపీఎస్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు సూర్యాపేట పట్టణంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం, దేవేందర్, కోటయ్య, జగదీశ్, నరేష్, యాదగిరి, మహేందర్ పాల్గొన్నారు.

జీసీసీ గోదాం పరిశీలన



గోదాములోని స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల కేంద్రలలోని జీసీసీ గోదామును మంగళవారం జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజర్ రాంపతి, జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్ గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గోదాములో ఉన్న స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి సరుకును పరిశీలించారు. గోదాము, స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న స్టాక్‌కు 250 క్వింటాల బియ్యం తక్కువగా వచ్చినట్లు సమాచారం. కాగా ఈ విషయాన్ని సివిల్ సప్లయీస్ అధికారులు అధికారికంగా ప్రకటించడం లేదు. మాయమైన 250క్వింటాళ్ల బియ్యానికి డబ్బులు చెల్లించాలని అధికారులు ఆదేశించినట్లు తెలిసింది.

సీతక్క రాజకీయంగా ఎదుర్కోవాలి

- కేటీఆర్‌పై తిట్లు, శాపనార్థాలు తగవు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు



మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: మంత్రి సీతక్క ప్రత్యర్థులను రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప తిట్లు, శాపనార్థాలు పెట్టడం మంత్రి స్థానానికి తగదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండల కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఇటీవల మంత్రి సీతక్క కేటీఆర్‌ను ఎదుర్కోలేక తాను సమ్మక్క తల్లి ఆడబిడ్డను అంటూ ఎదుటి వారిని తిట్టడం, శాపనార్థాలు పెట్టడం ఎంత వరకు సమంజసం అన్నారు. కేటీఆర్ ఐటీశాఖ మంత్రిగా పనిచేసిన సందర్భంలో ఎంతో మందికి ఉద్యోగాలు కల్పించిన గొప్పవ్యక్తి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లపై దురుసుగా మాట్లాడడం సరికాదన్నారు. జిల్లాలో ఎన్నో సమస్యలున్నాయని వాటిపై దృష్టి పెట్టాలన్నారు. గతంలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన ఒక్కో రైతుకు రూ.10వేలు ఆర్థిక సాయం ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. వర్షాలు పడుతాయని నార్లు పోసుకున్న రైతులు వర్షాలు లేక, బోరు బావుల నీటిని పారించుకుందామనుకున్నా విద్యుత్ సరఫరా సరిగా ఉండడం లేదన్నారు. ఏజెన్సీలోని రైతులకు దేవాదుల పైపులైన్ ద్వారా లక్నవరం, రామప్ప చెరువులను నింపి సాగునీరు అందించాలన్నారు. బీసీ రిజర్వేషన్ 42 శాతం ఇవ్వాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ తీర్మానం చేయగా అన్ని పార్టీలు మద్దతు తెలిపితే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఆర్డినెన్స్ ద్వారానే రిజర్వేషన్ తెస్తామని బీసీ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కొండాయి, మల్యాల గ్రామాలకు వెళ్లే దారిలోని జంపన్నవాగుపై బ్రిడ్జి నిర్మాణం ఇంకా చేపట్ట లేదన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, కృష్ణ, సునీల్‌కుమార్, ప్రదీప్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లోనూ ఏసీబీ ఆరా..!

- మాజీ ఈఎన్‌సీ మురళీధర్ అరెస్టు నేపథ్యం
- ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్వాహకుడితో సంబంధాలు
- మురళీధర్ కుమారుడు అభిషేక్ సన్నిహితులపై నిఘా
- కాళేశ్వరం ఇంజనీర్లలో ఒక్కొక్కరిపై దాడి
- ఏసీబీ లిస్టులో తరువాత ఎవరు..?



హనుమకొండ హంటర్‌రోడ్డులోని సహస్ర కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

సాక్షిప్రతినిధి, వరంగల్: కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకంగా వ్యవహరించిన మాజీ ఈఎన్‌సీ (జనరల్) చెట్టి మురళీధర్‌రావు మూలాలపై ఏసీబీ అధికారులు వరంగల్, హనుమకొండలలోనూ ఆరా తీశారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల మేరకు మంగళవారం ఉదయం మురళీధర్‌రావును ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. హైదరాబాద్ బంజారాహిల్స్, కరీంనగర్, జహీరాబాద్ తదితర పదిచోట్ల కుటుంబసభ్యులు, బంధువులు, సన్నిహితుల ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలోనే మురళీధర్‌రావు కుమారుడు అభిషేక్‌తో సన్నిహిత సంబంధాలు కలిగిన పలువురు కాంట్రాక్టర్ల గురించి ఆరా తీసినట్లు ప్రచారం. కాగా, కాళేశ్వరం ప్రాజెక్ట్‌తోపాటు సీతారామ, దేవాదుల, ఎస్సారెస్పీలలో కీలక పనుల సబ్ కాంట్రాక్ట్‌ల కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణల నేపథ్యంలో హనుమకొండకు చెందిన కాంట్రాక్టర్ల గురించి ఆరా తీయడం చర్చనీయాంశంగా మారింది. ఇరిగేషన్‌లో మురళీధర్‌రావు కీలకంగా వ్యవహరించిన సమయంలో ఆయన కుమారుడు అభిషేక్ బినామీగా కాంట్రాక్టు సంస్థలకు మేలు జరిగేలా కోట్లాది రూపాయల కాంట్రాక్టులు కట్టబెట్టారన్న ప్రచారం ఉంది. వర్క్‌ఆర్డర్‌లు జారీ చేసిన ఆధారాలు కూడా రాబట్టి హర్ష, సహస్ర (హనుమకొండ హంటర్‌రోడ్డు) కన్‌స్ట్రక్షన్ కంపెనీల పేర్లను బయట పెట్టినప్పటికీ.. మరో రెండు కాంట్రాక్టు సంస్థల గురించి ఆరా తీసిన ఏసీబీ పూర్తి వివరాలు బుధవారం వెల్లడించే అవకాశం ఉందని సమాచారం. కాగా, సహస్ర కంపెనీలో మంగళవారం సోదాలు నిర్వహించారు.

నెక్స్ట్ ఎవరో..

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకంగా వ్యవహరించి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక్కొక్కరిపై ఏసీబీ దాడులు నిర్వహిస్తోంది. ఏప్రిల్‌లో కాళేశ్వరం ఈఎన్‌సీ భూక్యా హరిరామ్‌ను ఆదాయానికి మించిన ఆస్తులున్నాయని అరెస్టు చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌజ్ సమీపంలో 28 ఎకరాల వ్యవసాయ భూమితోపాటు అమరావతిలో వాణిజ్య స్థలం, ప్లాట్లు, ఇళ్లు, విల్లాలు ఉన్నట్లు ప్రకటించారు. ఈయన ఆధ్వర్యంలో రూ.48,665 కోట్ల పనులు జరిగినట్లు కూడా గుర్తించారు. ఆ తర్వాత ఇదే ప్రాజెక్టులో కీలకంగా ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్ ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారని ఆయన కుటుంబసభ్యులు, బంధువుల్లో ఇటీవల ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా నూనె శ్రీధర్ వందల కోట్ల అక్రమాస్తులు కలిగి ఉన్నట్లు బయటపెట్టింది. తాజాగా, మంగళవారం ఉదయం మాజీ ఈఎన్‌సీ మురళీధర్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని కుటుంబసభ్యులు, బంధువుల్లో సోదాలు చేపట్టడం ఇరిగేషన్ వర్గాల్లో కలకలంగా మారింది. తదుపరి జాబితాలో ఎవరో? అన్న చర్చ ఇంజనీరింగ్ వర్గాల్లో సాగుతోంది.

కీలక అధికారుల్లో మొదలైన గుబులు..

వరుస దాడులతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన ఇంజనీర్లలో గుబులు మొదలైంది. పదవీ విరమణ చేసినా వదలకుండా ఏసీబీ దాడులు నిర్వహిస్తుండడం ఆందోళనకు గురిచేస్తోంది. వాస్తవంగా కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు, పంపుహౌస్‌లు కీలకం. ఈ పనుల నిర్వహణ, పూర్తిలో అప్పటి సీఈ నల్లా వెంకటేశ్వర్లు కీలకంగా వ్యవహరించారని అప్పటి ప్రభుత్వం ప్రశంసించి.. పదవీకాలాన్ని కూడా పొడిగించింది. మేడిగడ్డ కుంగుబాటు తర్వాత ఆయనతోపాటు 19 మంది వివిధ కేడర్‌లకు చెందిన అధికారులను ప్రస్తుత ప్రభుత్వం తప్పుబట్టింది. విజిలెన్స్, ఎన్‌డీఎస్ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిటీలు కూడా విచారించి నివేదికలు రూపొందించాయి. కొందరిపైన క్రిమినల్ కేసులకు కూడా సిఫారసు చేశారు. ఈ జాబితాలో ఉండి విచారణను ఎదుర్కొన్న ముగ్గురు అధికారులపై కొద్ది రోజుల తేడాతో ఆదాయానికి మించిన ఆస్తుల కలిగి ఉన్నారన్న ఆరోపణలపైనే ఏసీబీ దాడులు నిర్వహించింది. అక్రమ ఆస్తుల గుట్టువిప్పి అరెస్టు చేయగా.. తర్వాత జాబితాలో ఎవరు? అన్న అంశం ఇప్పుడు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంజనీరింగ్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

క్లుప్తంగా

హత్య కేసులో నేరస్తుడికి పదేళ్ల జైలు



భూపాలపల్లి అర్బన్: హత్య కేసులో నేరస్తుడికి కోర్టు పదేళ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించినట్లు భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం కమలాపూర్‌లో మార్చి 02, 2020న తాటి వనంలో గ్రామానికి చెందిన మాచర్ల రవి, రేగళ్ల తిరుపతి మధ్య గొడవ జరిగింది. ఈ సమయంలో కోపోద్రెకుడైన రవి.. తిరుపతిని హత్య చేశాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ వాసుదేవ రావు కేసు నమోదు చేసి రవిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపి రిమాండ్‌కు తరలించారు. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచి సాక్ష్యాధారాలు సమర్పించారు. ఈ ఘటనలో నేరం రుజువుకావడంతో రవికి భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రమేశ్ బాబు పదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ నరేశ్‌కుమార్ మంగళవారం తెలిపారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



హన్మకొండ చౌరస్తా: విశ్వబ్రాహ్మణ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఏటా ఇచ్చే ప్రతిభా పురస్కారాలకు విశ్వబ్రాహ్మణ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని పురస్కారాల కన్వీనర్, వోపా జిల్లా అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజారావు తెలిపారు. మంగళవారం హనుమకొండ రెడ్డి కాలనీలోని వోపా జిల్లా కార్యాలయంలో ప్రతిభా పురస్కారాల కమిటీ సమావేశం నిర్వహించారు. 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులు దరఖాస్తుతోపాటు మార్కుల సర్టిఫికెట్, బోనఫైడ్ లేదా కండక్ట్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్ ప్రతులను 9440313745 నంబర్‌కు ఈ నెల 30వ తేదీ వరకు వాట్సాప్ ద్వారా పంపించాలన్నారు. గడువు లోగా అందిన దరఖాస్తులలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి నగదు, ప్రశంస పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. పురస్కారాలకు ఎంపికైన విద్యార్థుల వివరాలు, పురస్కారాలు ఇచ్చే తేదీ, వేదిక త్వరలో వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. వోపా అసోసియేట్ అధ్యక్షుడు పాడిచెట్టి విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వరం భిక్షపతి, కోశాధికారి శ్రీరామోజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్ఆర్ఎం, ఎంఎల్ఐఎస్సీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి సౌజన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25, 28, 30, ఆగస్టు 1, 4, 6 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు. పూర్తివివరాలకు సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

పంచుకున్నదెవరు?

అన్‌యూజ్డ్ పోస్టుల కన్వర్షన్‌కు ఖర్చులవుతాయని వసూళ్లు..

- పదోన్నతిలో ఉన్న ఇంజనీర్ల నుంచి రూ.లక్షల్లో సేకరణ
- ఓ అసోసియేషన్ నేత కీలకంగా వ్యవహరించినట్లు చర్చ
- ఖర్చులకు ఆస్కారం లేదంటున్న టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఏళ్లుగా అన్‌యూజ్డ్‌గా ఉన్న పోస్టులను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసి కొత్త పోస్టులను క్రియేట్ చేసిన విషయం విధితమే. ఈ క్రమంలో కొత్త పోస్టులతో ప్రయోజనం చేకూరుతుందని ఆశ చూపి కొందరు వసూళ్లకు పాల్పడినట్లు విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇందులో ఉన్నత స్థాయి పోస్టుకు పదోన్నతిలో ఉన్న ఓ అసోసియేషన్ నాయకుడు కీలకంగా వ్యవహరించినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. కొన్ని సంవత్సరాలుగా అన్‌యూజ్డ్‌గా ఉన్న వర్క్‌మెన్ క్యాడర్‌కు చెందిన 216 పోస్టులను వినియోగంలోకి తీసుకురావాలని విద్యుత్ ఉద్యోగ సంఘాలు యాజమాన్యానికి మూడేళ్లుగా విజ్ఞప్తి చేస్తూ వస్తున్నాయి. ఈ క్రమంలో సీఎండీగా వరుణ్ రెడ్డి స్వీకరించిన తర్వాత సంస్థ అవసరాల దృష్ట్యా అన్ యూజ్డ్‌గా ఉన్న 216 పోస్టులతోపాటు ఖాళీగా ఉంటున్న 217 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను రద్దు చేస్తూ నూతనంగా 339 పోస్టుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పరిశీలించిన ప్రభుత్వం 339 పోస్టులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పోస్టులను సంస్థ అవసరాల మేరకు వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు విభాగాలు, సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్ల వారీగా టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం కేటాయించింది.

వసూళ్లకు తెర..

అన్ యూజ్డ్ పోస్టులు రద్దు, నూతన పోస్టుల మంజూరుకు సెక్రటేరియట్‌లో ఖర్చులు ఉంటాయని చెప్పి, పోస్టులు పెరిగితే లబ్ధి చేకూరే ఆశావహుల నుంచి కొంత ఎక్కువ మొత్తంలో, పోస్టులు పెరుగకున్నా పదోన్నతి లభించే మిగతా వారి నుంచి తక్కువ మొత్తంలో వసూళ్లు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. వీరికి తోడు కొన్ని అసోసియేషన్లు కూడా కొంత మొత్తం ముట్టజెప్పినట్లు తెలిసింది. పోస్టులు పెరిగితే తనకు పదోన్నతి వచ్చే అవకాశమున్న ఓ అసోసియేషన్ నాయకుడు ఈ వసూళ్లలో కీలకంగా వ్యవహరించినట్లు విద్యుత్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. రూ.లక్షల్లో వసూళ్లు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పోస్టులు మంజూరై వచ్చిన తర్వాత ఎలాంటి ఖర్చులు కాలేదని తెలియడంతో డబ్బులు ముట్టజెప్పిన వారు అవాక్కయ్యారు. వాస్తవంగా ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన ఈ వ్యవహారంలో ఎక్కడా అవినీతి, ఖర్చులకు ఆస్కారముండదు. అయితే అక్రమ సంపాదనకు అలవాటుపడిన కొన్ని అసోసియేషన్ల నాయకులు కొత్త పోస్టుల మంజూరుకు ఖర్చులవుతాయని దుష్ప్రచారం చేసి వసూళ్లకు పాల్పడడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వసూళ్ల దందాపై పలు యూనియన్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పోస్టుల మంజూరులో ఎక్కడా రూపాయి కూడా ఖర్చు లేదని యాజమాన్యం స్పష్టం చేసింది. అయితే వసూళ్లు చేసిన సొమ్ము ఎవరెవరు పంచుకున్నారని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.



రూ. లక్షల్లో దందా..

మూడేళ్ల క్రితం అన్‌యూజ్డ్ పోస్టులను వినియోగంలోకి తీసుకురావాలని ఉద్యోగ సంఘాలు యాజమాన్యానికి వినతి పత్రం అందించాయి. అయితే ఇందులో వర్క్‌మెన్ పోస్టులతో పాటు ఇంజనీరు, అకౌంటెంట్, పర్సనల్ ఆఫీసర్ పోస్టులు కావాలని ఆయా విభాగాల అసోసియేషన్ల నేతలు కోరారు. 216 అన్‌యూజ్డ్ పోస్టులను వర్క్‌మెన్ పోస్టులుగా వినియోగంలోకి తీసుకురావాలని ఉద్యోగ సంఘాలు పట్టుదలతో ఉన్నాయని, ఇంజనీర్‌తో పాటు ఇతర పోస్టులు మంజూరు చేయాలంటే యూనియన్ నాయకులను మచ్చిక చేసుకోవాలని, దీనికి ఖర్చులవుతాయని, అప్పట్లో ఏడీఈ నుంచి డీఈ పదోన్నతి కోసం ఎదురుచూస్తున్న వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది. డీఈ పదోన్నతి కోసం ఎదురుచూసిన ఇంజనీర్లు కొందరు రిటైర్డ్ అయ్యారు. వారు రిటైర్డ్ అయిన కొన్ని రోజులకే పదోన్నతి కల్పించారు. దీంతో వీరి వద్ద నుంచి వసూలు చేసిన సొమ్ము న్యాయంగా తిరిగి చెల్లించాలి. కానీ తీసుకున్న మొత్తం కాకుండా కొంత మాత్రమే తిరిగి చెల్లించారని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ రిటైర్డ్ ఇంజనీర్ తెలిపారు. ఇలా రెండు పర్యాయాలు వసూళ్లు చేసిన సొమ్ము ఎవరి చేతుల్లోకి వెళ్లిందని? ఎవరు కాజేశారని విద్యుత్ ఉద్యోగులు ఆరా తీస్తున్నారు. అయితే అన్ యూజ్డ్ పోస్టులను వినియోగంలోకి తీసుకురావాలని కోరామని, తాము ఎవరి నుంచి ఎలాంటి ప్రతిఫలం ఆశించలేదని కొన్ని విద్యుత్ ఉద్యోగ సంఘాలకు చెందిన నాయకులు స్పష్టం చేశారు. మరో వైపు వసూళ్లు చేసింది ఎవరు.. ఆ సొమ్ము ఎవరి చేతుల్లోకి వెళ్లిందనే అంశంపై యాజమాన్యం దృష్టి సారించినట్లు తెలిసింది.

19న కాజీపేటకు రైల్వేశాఖ మంత్రి

- మల్టీపుల్ యూనిట్ పనుల పరిశీలనకు రానున్న మంత్రి అశ్విని వైష్ణవ్

కాజీపేట రూరల్ : కాజీపేట మండలం మడికొండ శివారు పరిధి అయోధ్య పురంలో కేంద్ర ప్రభుత్వం సుమారు 160 ఎకరాల విస్తీర్ణంలో రూ.786 కోట్ల వ్యయంతో జపాన్ టెక్నాలజీతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, వ్యాగన్ షెడ్ మల్టీపుల్ యూనిట్‌ను ఈ నెల 19వ తేదీన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తనిఖీ చేయనున్నట్లు అధికారులు మంగళవారం తెలిపారు. రెండేళ్ల క్రితం ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన వ్యాగన్ షెడ్ నిర్మాణ పనుల్లో భాగంగా కోచ్‌ఫ్యాక్టరీని కూడా కేంద్రం మంజూరు చేసింది. ఈ మేరకు కాజీపేటలో రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, వ్యాగన్‌షెడ్, వ్యాగన్ పీఓహెచ్ షెడ్‌గా అప్‌గ్రేడ్ చేసి మల్టీపుల్ రైల్వే ప్రాజెక్టు యూనిట్‌గా విదేశీ టెక్నాలజీతో నిర్మిస్తోంది. ఇందులో కోచ్‌లు, వందేభారత్, మెమూ, ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు తయారవుతాయి. దాదాపు 70 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వ్యాగన్‌షెడ్, కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 10 వేల మందికి ఉపాధి లభించనుంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి అధికారికంగా కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, వ్యాగన్‌షెడ్‌లను ప్రారంభించేందుకు రైల్వే శాఖ ప్లాన్ చేస్తోంది. ఇందులో భాగంగా కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణ పనుల తనిఖీ కోసం రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ 19వ తేదీన కాజీపేట పర్యటన చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.



అయోధ్యపురంలో నిర్మాణమవుతున్న రైల్వే మల్టీపుల్ యూనిట్ ప్రాజెక్టు

17న దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జ్ జీఎం తనిఖీ..

కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, వ్యాగన్‌షెడ్ మల్టీపుల్ యూనిట్‌ను ఈ నెల 17వ తేదీన దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్ సందీప్ మథూర్ తనిఖీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. 19వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పర్యటనకు ముందస్తుగా దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జ్ జీఎం 17న సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో తనిఖీ చేసుకుంటూ కాజీపేట జంక్షన్ చేరుకుంటారు. అనంతరం కోచ్ ఫ్యాక్టరీ, వ్యాగన్‌షెడ్ నిర్మాణ స్థలానికి వెళ్లి నిర్మాణ పనులు పరిశీలిస్తారు. అధికారులతో సమావేశమై చర్చిస్తారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై దాడి

- ఇద్దరు విద్యార్థులపై కేసు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై దాడి చేసి గాయపరచిన ఇద్దరు విద్యార్థులపై బాధిత ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. పరీక్ష రాస్తున్న సమయంలో కళాశాల ప్రిన్సిపల్ పర్యవేక్షిస్తుండగా కొంతమంది విద్యార్థులు వికృత చేష్టలకు పాల్పడ్డారు. ఇలా ఎందుకు చేస్తున్నారని, పద్ధతి కాదని సదరు విద్యార్థులను ప్రిన్సిపాల్ మందలించారు. దీంతో విద్యార్థులు.. ప్రిన్సిపాల్‌ను అసభ్యకర పదజాలంతో దూషించి, చేయి చేసుకున్నారని సీఐ పేర్కొన్నారు. ఎవరైనా ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవటంతోపాటు రౌడీ షీట్ తెరుస్తామని సీఐ హెచ్చరించారు.

రేపు గిరిజన హస్తకళల ప్రదర్శన

న్యూశాయంపేట : సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఏటూరు నాగారం, ట్రైబల్ ఫెడరేషన్ అండ్ మార్కెటింగ్ (ట్రైపాడ్) ఆధ్వర్యంలో ఈనెల 17న హనుమకొండలోని గిరిజన భవన్‌లో గిరిజన కళాత్మక హస్త కళల (చేతివృత్తులు) (తేనె బుట్టల తయారీ, పెయింటింగ్, ఫుడ్ ప్రాడక్ట్స్ తదితర వస్తువుల మార్కెటింగ్ మేళా) ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి డి.సౌజన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆసక్తిగల గిరిజన కళాకారులు చేతివృత్తుల ద్వారా తయారు చేసిన వస్తువులు ప్రదర్శించడానికి హాజరు కావాలని కోరారు. మేళాకు హాజరయ్యే కళాకారులకు ఐటీడీఏ ఏటూరునాగారం ఆధ్వర్యంలో రవాణా చార్జీలు చెల్లిస్తారన్నారు. వివరాలకు 9652369090 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తెలుగు విభాగం బీఓఎస్‌గా శంకర్ కొనసాగింపు

- చిర్ర రాజు నియామకం నిలిపివేత

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మంథిని శంకర్ కొనసాగనున్నారు. మంగళవారం ఆ విభాగం బీఓఎస్‌గా ఆయన స్థానంలో వీసీ ప్రతాప్‌రెడ్డి అప్రూవల్ మేరకు డాక్టర్ చిర్రరాజును నియమిస్తూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో శంకర్ తాను బీఓఎస్‌గా నియామకమై ఐదు నెలలే అవుతుందని, తనను సంవత్సరంపాటు కొనసాగించాల్సిందిగా మధ్యలో ఎలా తొలగిస్తారని వీసీ ప్రతాప్‌రెడ్డి వద్దకు వెళ్లి అడిగారు. గతంలో ఒకసారి ఏడు నెలలు బీఓఎస్ బాధ్యతలు నిర్వర్తించారని, ఇప్పుడు ఐదు నెలలు కలిపి సంవత్సరం పూర్తికావడంతో బీఓఎస్‌గా చిర్రరాజును నియమించారని అధికారులు శంకర్‌కు తెలిపారని సమాచారం. గతంలో బీఓఎస్‌గా బాధ్యతలను నిర్వర్తించింది ఇప్పుడు కలపొద్దని, ఈఏడాది ఫిబ్రవరిలో బీఓఎస్‌గా నియమించారని, ఇప్పుడు సంవత్సరం వరకు తనను బీఓఎస్‌గా కొనసాగించాల్సిందేనని శంకర్.. వీసీ ప్రతాప్‌రెడ్డి వద్ద తన వాదన వినిపించారని సమాచారం. ఆ సమయంలో అక్కడే ఉన్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ చిర్ర రాజు కూడా చివరికి శంకర్‌ను కొనసాగించేందుకు ఓకే చెప్పినట్లు సమాచారం. దీంతో బీఓఎస్‌గా చిర్రరాజు నియామకాన్ని నిలిపివేశారు. మంథిని శంకర్ కొనసాగనున్నారు.

సోమేశ్వర స్వామివారికి జువ్వి పూలతో అలంకరణ



పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారిని ఆషాఢం, శ్రావణమాసం మధ్యలో పూసే 10 కేజీల జువ్వి పూలతో వరంగల్‌కు చెందిన భక్తులు తోట గణేశ్ దంపతులు అలంకరించారు. కాగా, స్వామివారి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

తపాలా ఆధునికీకరణ..

- 22న ఐటీ–2.0 సాంకేతికత ప్రారంభం
- వేగవంతం కానున్న బట్వాడ సేవలు

ఖిలా వరంగల్: పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధునికీకరణ దిశగా మరో ముందు అడుగు వేసింది. జూలై 22వ తేదీ నుంచి వరంగల్, మహబూబాబాద్ జిల్లాలో అన్ని తపాలా కార్యాలయాల్లో ఐటీ–2.0 సాంకేతికతను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సూపరింటెండెంట్ బి. రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నూతన సాంకేతికతను రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే నల్లగొండ డివిజన్‌లో జూలై 8వ తేదీన ప్రారంభించారని, ఇప్పుడు రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో ఈనెల 22న తేదీ నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. వరంగల్, మహబూబాబాద్ జిల్లాలో ప్రస్తుతమున్న 2 హెడ్ పోస్టాఫీస్‌లు, 42 సబ్ పోస్టాఫీస్‌ల్లో ఈనూతన సాంకేతికతను అమలు చేయనున్నామని తెలిపారు. పార్సిల్, సీఓడీ, వీపీపీ వంటి సేవల బట్వాడ వేగవంతం అవుతుందని, డిజిటల్ సిగ్నేచర్, డిజిటల్ మోడ్ చెల్లింపులు వంటి ఆధునిక సదుపాయాలు వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈక్రమంలో జూలై 18,19 తేదీల్లో ఆన్‌లైన్ నమోదు పనులు, 21న పూర్తి స్థాయిలో లావాదేవీలు నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, ఖాతాదారులు తమ తపాలా లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ మార్పు వల్ల తాత్కాలికంగా కొన్ని అసౌకర్యాలు కలగొచ్చునని, అయితే వాటిని సమర్థవంతంగా అధిగమించి మెరుగైన సేవలు అందించేందుకు ఇది ముందడుగని రవికుమార్ తెలిపారు.

ప్రజా ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

- ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్

ఖిలా వరంగల్: ప్రజాఉద్యమాల నిర్మాణంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. మంగళవారం వరంగల్ శంభునిపేట జంక్షన్‌లోని ఆర్ఆర్ ఫంక్షన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అధ్యక్షతన జిల్లాస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి అశోక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన మాలోత్ సాగర్, ముక్కెర రామస్వామితోపాటు వందలాది మంది కార్యకర్తలకు కండువాలు కప్పి మాట్లాడారు. కమ్యూనిస్టులు, ప్రజా ఉద్యమాలను బలహీనపర్చాలని పాలకులు అన్ని విధాలా కుట్రలు చేస్తున్నారన్నారు. నిర్బంధాలు విధించి కుట్రతో కేసులు పెడుతున్నారన్నారు. సమాజంలో దోపిడీ ఉన్నంత కాలం ఎర్ర జెండా ఉద్యమాలు ఉంటాయని పేర్కొన్నారు. దోపిడీ వర్గాల ఐక్యత కమ్యూనిస్టుల మధ్య లేకపోవడం పాలకులకు వరంగా మారిందన్నారు. ఈ క్రమంలో ఎంసీపీఐ(యూ).. కమ్యూనిస్టుల ఐక్యతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని, కార్యకర్తల్లో లోటుపాట్లను సరి చేసి సరైన దృక్పథంతో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, వల్లపు ఉపేందర్‌రెడ్డి, గోనె కుమారస్వామి, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, మంద రవి, నర్ర ప్రతాప్, కన్నం వెంకన్న, వంగల రాగ సుధ, కనకం సంధ్య, మాలోత్ ప్రత్యూష, గణిపాక ఓదెలు, మహమ్మద్ అబ్బు, తాటికాయల రత్న, దాసు, మాధవి, రామస్వామి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లపై సమీక్ష

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఆగస్టు 19, 20, 21 తేదీల్లో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించబోతున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం కేయూలో వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి. రామచంద్రం.. మానిటరింగ్ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో భాగస్వాములు కాబోతున్న రీసెర్చ్ పేపర్ల సమర్పణకు ఎంతమంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ కమిటీల బాధ్యతలు, అతిథులకు వసతి ఏర్పాట్లు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ లోకల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి. వెంకట్రామ్ రెడ్డి, మానిటరింగ్ కమిటీ సభ్యులు, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జాయింట్ సెక్రటరీ వద్దె రవీందర్, వైస్ ప్రెసిడెంట్ సి.హెచ్. సంజీవరెడ్డి, ప్రొఫెసర్లు టి. మనోహర్, బి. సురేశ్‌లాల్, ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ఎస్. జ్యోతి, జె. కృష్ణవేణి, ఎన్. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మానిటరింగ్ కమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు

- మార్కెట్ కార్యదర్శి గుగులోత్ రెడ్యా

వరంగల్ చౌరస్తా : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని వరంగల్ ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి గుగులోత్ రెడ్యా హెచ్చరించారు. మంగళవారం మార్కెట్ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా నెలకొన్న తక్‌పట్టీల విషయంలో జరిగిన పరిణామాలు వివరించారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలన్నారు. వ్యాపారులు, అడ్తిదారులు, కార్మికులు.. రైతులను సమన్వయం చేస్తూ గిట్టుబాటు ధరలు కల్పించేందుకు తోడ్పడాలని పేర్కొన్నారు. సమావేశంలో గ్రేడ్–2 కార్యదర్శులు రాము, అంజిత్ రావు, అసిస్టెంట్ సెక్రటరీ దండమల్ల రాజేందర్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెక్రటరీ గుగులోత్ రెడ్యా

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 12 మంది ఎంపిక

- విద్యార్థులను అభినందించిన వీసీ

కేయూ క్యాంపస్ : క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో కాకతీయ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగంలో 12 మంది ఫైనలియర్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆ విభాగం అధిపతి డాక్టర్ తాడూరి శాస్త్రి మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని బ్రిలియంట్ బయో ఫార్మాసంస్థ నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంటులో ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.18వేల వేతనంతో పాటుగా హెచ్ఆర్ఏ అలవెన్స్ కూడా చెల్లిస్తారని తెలిపారు. అలాగే, మరో ఇద్దరు విద్యార్థులు హనుమకొండలోని వాసవి హాస్పిటల్స్‌లో జూనియర్ ఎంబ్రియాలజిస్టుగా ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి. రామచంద్రం అభినందించారు. కార్యక్రమంలో కేయూ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ చిర్రరాజు, బీటీఎస్ చైర్మన్ డాక్టర్ పి. శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల్లో కలుపు..

సమస్య పరిష్కారానికి యాజమాన్య పద్ధతులు పాటించాలి

- మల్యాల కేవీకే ఇన్‌చార్జ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ క్రాంతికుమార్
- రైతులకు పలు సలహాలు, సూచనలు

మహబూబాబాద్ రూరల్: ఇటీవల కొద్దోగొప్పో కురిసిన వర్షాలకు రైతులు పప్పు దినుసు పంటలు పెసర, మినుము, కంది, నూనెగింజ పంటలు సోయాబీన్, వేరుశనగతోపాటు మొక్కజొన్న, శనగ పంటలు వేశారు. అలాగే, వాణిజ్య పంట పత్తిని కూడా వేశారు. ఈ నేపథ్యంలో ఈ పంటల్లో కలుపు సమస్య రైతులను ఇబ్బందికి గురిచేయడమే కాకుండా దిగుబడి తగ్గేందుకు కారణమవుంది. ఈ నేపథ్యంలో ఆరుతడి పంటల్లో కలుపు సమస్య పరిష్కారానికి యాజమాన్య పద్ధతులు పాటించాలని మల్యాల కేవీకే ఇన్‌చార్జ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.క్రాంతికుమార్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. పప్పు దినుసు పంటల్లో (పెసర, మినుము, కంది) రైతులు విత్తేముందు ఫ్లూక్లోరాలిన్ 45 శాతాన్ని ఎకరాకు 1 నుంచి 1.2 లీటర్ల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కలుపు ఇక్కడే నివారించొచ్చు. తర్వాత మొలకెత్తకముందు పెండిమిథాలిన్ 30 శాతాన్ని ఎకరాకు 1.3 నుంచి 1.6 లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే, పైరు విత్తిన 20 రోజులకు వెడల్పు ఆకు కలుపు నివారణకు ఇమాజితాపైర్ (ఫర్యూట్) మందును 300 మిల్లీ లీటర్లు ఎకరాకు లేదా గడ్డి జాతి కలుపు నివారణకు క్విజాలిఫాస్ ఇథైల్ (టర్గా సూపర్) 400 మిల్లీ లీటర్లు లేదా ప్రొపాక్విజాఫాస్ 10 శాతం ఈసీ 200 ఎంఎల్ మందు పిచికారీ చేసుకోవాలి. రైతులు కలుపు మందులు పిచికారీ చేసే సమయంలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. అదే విధంగా వేరుశనగ పంటల్లో కూడా కలుపు మందులను వివిధ దశల్లో పిచికారీ చేసుకోవాలి. విత్తిన 25 నుంచి 30 రోజులు తర్వాత గొర్రుతో అంతరకృషి చేసుకోవడం ద్వారా కలుపు ఉధృతిని తగ్గించుకోవచ్చు. వాణిజ్య పంట పత్తిలో నెల రోజులకు వచ్చే లేత గడ్డి, వెడల్పు ఆకు గల కలుపు నివారణకు క్విజలోఫాస్ ఇథైల్ (టర్గాసూపర్) 400 మిల్లీ లీటర్లు లేదా ప్రోపాక్విజాఫాస్ (ఏజిల్) 250 మిల్లీ లీటర్ల తోపాటు పైరిథయోబ్యాక్ సోడియం (హిట్ వీడో థీమ్/రైప్) 250 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. అలాగే, పత్తిలో సమయానుకూలంగా పది రోజులకు ఒకసారి గొర్రు లేదా గుంటుకతో అంతరకృషి చేయాలి.



పెసర చేనులో పెరిగిన కలుపు మొక్కలు



మొక్కల మధ్యలో పెరిగిన తుంగ, గరక